నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం 28 డిసెంబర్ 2023 www.navatelangana.com

ప్రజా పాలన ప్రారంభిస్తున్న సీఎంకు ధన్యవాదాలు

నవ తెలంగాణ - సిద్దిపేట



ప్రజా పాలన ప్రారంభిస్తున్న సీఎంకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు ప్రజాపాలన ప్రారంభం కాబోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి గంప మహేందర్, సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి, మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ కాలీముద్దీన్ , సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, చందూ, వాహబ్, ఆర్షద్, అజ్మత్, మున్నా, సీత బాలు, బైరి శంకర్, ప్రతాప్, వంశీ, పవన్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐది బలమైన ఉద్యమాల చరిత్ర

సీపీఐ జెండా ఆవిష్కరణలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ-బెజ్జంకి



పేదల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలు చేసిన చరిత్ర సీపీఐ పార్టీదేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ వద్ద ఏర్పాటు చేసిన సీపీఐ ఆవిర్భావ దినోత్సవానికి జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంగళవారం మృతి చెందిన సీపీఐ మండల నాయకుడు నిమ్మ ధర్మారెడ్డి కుటుంబ సభ్యులను చాడా వెంకటరెడ్డి పరామర్శించి భరోసానిచ్చారు. కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి, కార్యవర్గ సభ్యులు పోలిరెడ్డి వెంకట రెడ్డి, సహాయ కార్యదర్శి కోహెడ స్రుజన్ కుమార్, గడిపే మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బోనగిరి మహేందర్, మండల కార్యదర్శి బోనగిరి రూపేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు, దొంతర వేణి మహేశ్ పాల్గొన్నారు.

గ్యారెంటీలను అమలు చేస్తాం

నవ తెలంగాణ- గజ్వేల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పరిపాలన 6 గ్యారంటీల అమలు కోసం గురువారం నుండి జనవరి 6 వరకు సంబంధిత అర్హుల నుండి దరఖాస్తుల స్వీకరిస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంతో పాటు గజ్వేల్ మండలం ప్రతి గ్రామంలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తు అధికారులు స్వీకరించి ప్రభుత్వానికి పంపుతారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అంటే ప్రజాపాలన అని ఆయన తెలిపారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన మూలంగానే ఇంటికి పంపినట్లు ఆయన విమర్శించారు. జిల్లాలో ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి నాయకులు, అధికారులు, నియోజకవర్గం, మండల గ్రామస్థాయిలలో నాయకులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు.

వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ ములుగు



వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కుమార్ నారాయణ్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 12వ తేదీన మామిడాల గ్రామానికి చెందిన నీరుడి ఉప్పలయ్య(46) సొంత పనిపై భావనందాపూర్ గ్రామానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని బైక్‌పై సాయంత్రం 6 గంటలకు మామిడియాలకు వస్తుండగా మార్గ మధ్యంలో క్షీరసాగర్ నుండి అనంతారం వెళ్లే రోడ్డుపై గల కల్వర్టు దగ్గరకు రాగానే రాత్రి 7.30 గంటల సమయంలో రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వడ్ల కుప్ప వడ్ల సంచులు పెట్టడంతో ఆ కుప్పను ఢీకొని కిందపడ్డాడు. అతనికి గాయాలు కాగా దగ్గర్లోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మేడ్చల్‌లోని ఆదిత్య ఆసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలించారు. బుధవారం ఆయన మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవెల్లి డ్యాం ప్రధాన కాల్వలో చెట్ల తొలగింపు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి డ్యాం ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న చెట్లను ఉపాధి హామీ కూలీలు తొలగించే పనులు జోరుగా సాగుతున్నాయి. బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆదేశాల మేరకు గౌరవెల్లి డ్యాం ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను ఉపాధి హామీ కూలీల ద్వారా తొలగిస్తున్నామని అన్నారు. ఈ పనులను ఉపాధి హామీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మజ్జిక మొగిలి, ఉపసర్పంచ్ కొమ్ముల భాస్కర్, మాజీ ఎంపీటీసీ బైరగొని శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం

నవతెలంగాణ - చిన్నకోడూరు



ప్రజా ప్రభుత్వం కొలువైన నెలరోజులలోపే అభయహస్తం 6 గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అజ్జు యాదవ్ అన్నారు. డిసెంబర్ 28 నుండి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల లబ్ధి కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మారుమూల పల్లె వరకు సంక్షేమ పథకాలు అందాలన్నదే మా లక్ష్యమని, పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎంత దూరంగా ఉంది అనేది ప్రజావాణి చూస్తే అర్థం అవుతుందన్నారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని, ప్రజలు హైదరాబాద్ వరకు వచ్చి ఇబ్బంది పడకుండా ప్రభుత్వమే ప్రజల దగ్గరకు పోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రజలకు సుపరిపాలన అందించేందుకు మొదటిసారిగా ప్రవేశపెట్టిన ప్రజా పరిపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్



నవతెలంగాణల-గజ్వేల్

గజ్వేల్ ప్రాంతానికి 30 సంవత్సరాలుగా సేవలందించాలని లక్ష్యాన్ని నెరవేర్చుకున్నామని అమెరికా తెలుగు సంఘం నాయకులు చెప్పడం గొప్ప విషయమని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో బుధవారం అమెరికా తెలుగు అసోసియేషన్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి నేతృత్వంలో పలు స్వచ్ఛంద సంస్థలు గజ్వేల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం సక్సెస్ అయింది. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు భారీగా తరలి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. లయన్స్ క్లబ్ వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు దాదాపు 2000 మందికి వైద్య సేవలు అందించి ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, అమెరికా తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు జయంత్ రెడ్డి, మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని, అమెరికా తెలుగు సంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారికి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, భాగ్యలక్ష్మి దుర్గా ప్రసాద్,అమెరికా తెలుగు సంఘం ఫౌండర్ హన్మంత్ రెడ్డి, భీమ్ రెడ్డి,సతీష్ రెడ్డి, డాక్టర్ కాశీనాత్,లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు, గజ్వేల్ ఐ ఎం ఎ అధ్యక్షులు డాక్టర్ లింగం,సెక్రటరీ మహిపాల్,డాక్టర్ సుజాత,డాక్టర్ నరేష్ బాబు,డాక్టర్ పెంటా చారి,డాక్టర్ మల్లయ్య లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ,సెక్రటరీ సంజయ్ గుప్త,లయన్ పరమేశ్వర చారి, లయన్ నంగునూరి సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస్,లయన్ గోలి సంతోష్,లయన్ విజయ్ భాస్కర్, ఎన్ సీ సంతోష్, లయన్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

జిల్లా ఇన్చార్జి మంత్రిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-జహీరాబాద్



ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె ఛాంబర్‌లో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా అభివద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల వద్దకే పరిపాలన

- ఆరు గ్యారంటీలు అందించడమే లక్ష్యం
- డేటా సేకరణ కోసమే దరఖాస్తులు
- మార్గదర్శకాల తర్వాతే పథకాల అమలు
- గుడ్డిగా పథకాలివ్వబడవు
- అర్హులలకే లబ్ధిచేకూరుద్ది
- దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ
- మంచి పథకాల్ని కొనసాగిస్తాం
- కక్షసాధింపులుండవు
- మాది ఫ్రెండ్లీ గవర్నమెంట్
- ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాహక సమావేశంలో మంత్రి కొండా సురేఖ





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజల వద్దకే పరిపాలన తీసుకెళ్లాలనే ఉన్నత ఆశంతోనే ప్రజాపాలన కార్యక్రమం చేపట్టామని, ఆరు గ్యారంటీలను అందించడమే ప్రభుత్వ లక్షమని దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాహక సమావేశం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు సైతం హాజరయ్యారు. ప్రజాపాలన కార్యక్రమంపై పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమానికి సహకరిస్తామని బీఆర్ఎస్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల వద్దకు అధికారులు వస్తున్నారంటే వారెంతో ఆసక్తిగా ఉన్నారన్నారు. గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించిన పథకాల గురించి దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. ఎనిమిది రోజులు మాత్రమే కాకుండా దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ప్రత్యేక కౌంటర్లలోనే కాకుండా తర్వాత కూడా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ దరఖాస్తులు తీసుకుంటారన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు సాధారణ దరఖాస్తుల్ని కూడా తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా సేకరించిన సమాచారాన్ని కంప్యూటరీకరిస్తామన్నారు. వచ్చిన మొత్తం సమాచారాన్ని సమీక్షించి ఏఏ పథకాలకు ఎంత మంది అర్హులవుతారనే అంచనాలను బట్టి ప్రభుత్వం నిర్ణయిం తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా ప్రజలకిచ్చిన హామీలు, పేదల ఆశల్ని నెరవేర్చడం కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. వైఎస్సార్ చేపట్టిన మంచి పథకాల్ని బీఆర్ఎస్ కొనసాగించిన మాదిరిగానే బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మంచి పథకాల్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కక్షసాధింపు చర్యలు ఉండబోవని, మాది ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు. విపక్షాలు ఆదిలోనే విమర్శనాస్త్రాలు గుప్పించవద్దని సూచించారు. ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశమిచ్చినందున వారి ఆకాంక్షల్ని నెరవేర్చేలా ప్రభుత్వం నడుచుకుంటుందన్నారు. రైతు భరోసా ఎవరికివ్వాలి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు అనేది ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తుందన్నారు. ఉద్యమకారులకు ఎఫ్ఐఆర్ కాఫీ ఉంటే సరిపోతుందన్నారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ దరఖాస్తులు అందుతాయన్నారు. రేషన్‌కార్డులో పేర్లు నమోదు కాని కుటుంబ సభ్యులు వారి కుటుంబ రేషన్‌కార్డు నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామ, వార్డు సభల్లో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు.

అధికారులు, ఉద్యోగులు కాంగ్రెస్‌ను గెలిపించారని, అధికార యంత్రాంగం సహకారంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. సమావేశంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్యరావు, చింత ప్రభాకర్, డాక్టర్ సంజీవరెడ్డి, మ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్లు మంజుశ్రీ, రోజా, హేమలతా, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు స్వీకరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీలల గల 114 వార్డులలో షెడ్యూల్ ప్రకారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రతి ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాలలో ప్రజాపాలన కార్యక్రమం షెడ్యూల్ ప్రదర్శించామని తెలిపారు. దరఖాస్తులను స్వీకరించడానికి 2 టీంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 2 గంటల వరకు పంచాయతీ సెక్రటరీ, కరోబార్, ఏఎస్ఎం, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, వీఓఎ, ఏఈఓ తదితరులతో కూడిన గ్రామ స్థాయి బృందాలు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. కుటుంబానికి ఒక దరఖాస్తు చొప్పున అన్ని దరఖాస్తులను గ్రామ పంచాయతీలకు పంపించామన్నారు. దరఖాస్తుకు ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్ కార్డు జత చేయాలన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు, ఇతర దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. దరఖాస్తు స్వీకరణ అనంతరం దరఖాస్తుదారులకు రసీదు ఇస్తామని తెలిపారు. జనవరి 6వ తేదీ వరకు గ్రామపంచాయతీలో సెక్రెటరీకి దరఖాస్తులను అందజేయవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మండలపూజ

పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ - మెదక్



వేద పండితుల మంత్రోచ్చారణలు.. అయ్యప్ప స్వాముల శరణు ఘోష.. భక్తుల జయజయ ధ్వానాల మధ్య అయ్యప్ప మండలపూజ బుధవారం మెదక్ పట్టణంలో ఘనంగా జరిగింది. స్థానిక అయ్యప్ప దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవా, శ్రీ గణేష, శ్రీ సుబ్రమణ్య స్వామిపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, పదు నెట్టంబడి పూజ వైభవంగా జరిగింది. గురుస్వాములు హరిదాస్, వైద్య రాజు వేద మంత్రాలు పఠించారు. మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి, గురుస్వామి వైద్య రాజు ఆశీర్వచనాలు అందజేశారు. పడి పూజలో భజన బృందం పాడిన పాటలు అలరించాయి. అనంతరం గీతా విద్యా సంస్థల చైర్మన్ రామాంజనేయులు అన్నదనం నిర్వహించారు. పూజల్లో ఆలయ పూజారి అశోక్, గురు స్వాములు గంగ లక్ష్మిపతి, శంకర్, శ్రీకాంత్ రెడ్డి, రమేష్, కొండ శ్రీను, పురం వెంకట్ నారాయణ, వీర్ కుమార్, పార్థివ నాథ్, శ్రీధర్, సత్యం, రాధా కృష్ణ, సత్యానారాయణ, ఆలయ బాధ్యులు చక్రపాణి, ప్రభు గౌడ్ పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం సేకరించిన భూమి ఎంత?

ఎజెండాలో ఆ అంశం మినహా

మిగిలిన అంశాలకు అమోదం

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట మున్సిపాల్ సర్వసభ్య సమావేశం బుధవారం వాడీవేడిగా సాగింది. భూగర్భ మురుగు కాల్వ నిర్మాణం కోసం 1076, 1078, 973, 974, 982 సర్వే నెంబర్లల్లో కరీమున్నీషా భేగం నుంచి 4 ఎకరాల 10 గుంటలు సేకరించినట్లు చూపి, ప్రత్యామ్నాయంగా పురపాలక సంఘం పరిధిలోని భూమిని ఇచ్చేందుకు, ఎజెండాలో అంశం చేర్చడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఆయా సర్వే నంబర్లలో సదరు వ్యక్తి నుంచి సేకరించిన భూమి ఎంత? అని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఆ భూమిలోంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ వెళ్లలేదని తెలిపి.. తిరిగి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపాల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు, మున్సిపాల్ కమిషనర్ సంపత్ కుమార్ జోక్యం చేసుకొని రీసర్వే అనంతరమే ఋూమోదిద్దామని, అంతవరకు ఆ అంశం ఎజెండా నుంచి తొలగిస్తున్నట్లు తెలపడంతో కౌన్సిలర్లు శాంతించారని తెలిసింది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. మున్సిపాల్ సానిటరీ ఇన్స్ స్పెక్టర్ వనిత విధులకు హాజరు కాకుండా అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు చేస్తున్నట్లు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించారు. గత నెలలో లీవ్ లెటర్ పెట్టి ఊరికి వెళ్లిన ఆమె తిరిగి వచ్చాకా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతాకాలు చేసి లీవ్ లెటర్ చింపినట్లు ఆధారలతో సహా సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూం ఇండ్లలోని టాయిలెట్ల లీకేజీ మరమ్మతుల కోసం రూ.3 కోట్ల 20 లక్షలు కేటాయించడంపై ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూంలు ఏ నిర్మాణ సంస్థవారు కట్టించారు? ఎన్ని రోజుల వరకు నిర్వహణ బాధ్యత ఉంటుందని కౌన్సిలర్లు ప్రశ్నించారు. పలువురు కౌన్సిలర్లు వారి వార్డుల పరిధిలోని సమస్యలను సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీవో రమేష్ బాబు ప్రజా పాలన కార్యక్రమం గురించి వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు పయ్యావులు పూర్ణిమ ఎల్లం, నాయకం లక్ష్మన్, సద్ది నాగరాజు, కలకుంట్ల మల్లీకార్జున్, తాసిల్దార్ దిలీప్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

నిషేధిత ఆల్ప్రజోలం డ్రగ్ తయారీ ముఠా గుట్టురట్టు

- రూ.70 లక్షల విలువ గల ముడి పదార్థాల స్వాధీనం
- నలుగురు నింధితుల అరెస్టు: ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి





నిషేధిత ఆల్ప్రజోలం డ్రగ్స్ తయారీ యూనిట్లపై దాడి చేసి నలుగురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు ఎస్పీ రూపేష్ తెలిపారు. ఆల్ప్రజోలం తయారీ గుట్టును రట్టు చేసిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు సంగారెడ్డి మండలంలోని పసల్వాదిలో నలుగురు వ్యక్తులు రహస్యంగా గుట్టుగా నిషేధిత ఆల్ప్రజోలం డ్రగ్ తయారు చేస్తున్నట్లు తెలుసుకుని దాడి చేసినట్లు తెలిపారు. కమల్ బ్రహ్మానందగౌడ్, చిరుగోరి డేవిడ్, కొండాపురం శివ అక్రమంగా ఆల్ప్రజోలం తయారీ యూనిట్ నడుపుతున్నట్లు పేర్కొన్నారు. టీఎస్ ఎన్ఎబీ, సంగారెడ్డి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. రూ.70 లక్షల విలువ చేసే పారా నైట్రోక్లోరో బెంజీన్, బెంజోనైట్రేట్, బెంజైల్ ఆయానైడ్, డిథైల్ ఆయానైడ్, డి హైడ్రేడ్ వంటి ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బ్రహ్మానందగౌడ్, డేవిడ్ 2018లో అండర్ ట్రయల్ నేరస్తులుగా కంది జైలులో కలుసుకుని అప్పటి నుంచి అక్రమంగా ఆల్ప్రజోలం తయారు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. రెండేళ్ల క్రితం బెయిల్‌పై వచ్చిన బ్రహ్మానందం పటాన్‌చెరులో డేవిడ్ కుటుంబ సభ్యులకు సహాయం చేశాడన్నారు. ఆ తర్వాత డేవిడ్ తనకున్న అనుభవంతో కొండాపురం శివ అనే ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న కెమిస్ట్‌ను నియమించుకుని మార్కెట్లో లభించే రసాయనాలను సేకరించి ఆల్ప్రజోలం తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువకులు, విద్యార్థులు డ్రగ్స్ మత్తుకు చిత్తవుతున్నందున రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీస్ విభాగం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. డ్రగ్స్ తయారీ గురించి ఎలాంటి సమాచారమున్నా అనుమానాలొచ్చినా పోలీసులకు సమాచారం తెలపాలని కోరారు. సమావేవంలో డీఎస్పీ రమేష్‌కుమార్, రూరల్ సీఐ సుదీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత విద్యా, ఉపాధి కల్పనకు 'ఛలో పార్లమెంట్'

నవతెలంగాణ-కొండాపూర్



అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఇతర 16 విద్యార్థి సంఘాలు జనవరి 12న 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కొండాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో 'ఛలో పార్లమెంట్' పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా నూతన విద్యా విధానం తీసుకొచ్చిందన్నారు. ఈ విద్యా విధానంతో విద్యార్థులకు ఒరిగేది ఏం లేదని స్పష్టం చేశారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు, అందరికీ ఉచిత విద్యా ఉపాధి కల్పించాలని జనవరి 12వ తేదీన ఛలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉనప్పటికీ.. కేవలం 0.3 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నదని దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కొఠారి కమిషన్ ప్రకారం 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందని.. ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. అలాగే బీజేపీ వచ్చిన తర్వాత కేంద్ర విశ్వవిద్యాలయాలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నాయని ఆరోపించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు నిరసనలు తెలిపితే.. అక్రమంగా అరెస్టు చేసి కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా జరిమానాలు విధిస్తున్నారని.. రక్షించిన వారిపై దేశద్రోహం కేసుల పేరుతో హింసకాండకు దిగుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ లేకుండా బీజేపీ ప్రభుత్వం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో నిరసన తెలిపితే రూ.20వేల జరిమానా విధిస్తామని వైస్ ఛాన్సలర్ సర్కులర్ జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఎన్టిఏ ద్వారా అన్ని రకాల జాతీయస్థాయి పోటీ పరీక్షలను కేంద్రమే నిర్వహించాలని చూస్తోందన్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలన్నీ ఎన్టిఏ నిర్వహించడం ద్వారా అధికార కేంద్రీకతమై తమిళనాడులో జాతీయస్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అవకతవకలు జరిగిన మాదిరిగా ఇతర పోటీ పరీక్షల్లో జరిగే అవకాశం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అందరికీ ఉచిత విద్య, అందరికీ ఉపాధి కల్పించాలని చేపట్టబోయే ఛలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రజాస్వామిక వాదులు అందరూ మద్దతు ఇవ్వాలన్నారు. వాణి, అర్చన అక్షయ,నాగరాణి, అఖిల తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు మరువెల్లి విద్యార్థిని

నవతెలంగాణ-వట్‌పల్లి





మండలంలోని మరువెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న టి.మానస అనే విద్యార్థిని జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. కొమురం భీం జిల్లా అసిఫాబాద్‌లో ఈనెల 20,21, 22 తేదీలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని.. ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి తెలిపారు. ఎస్‌డీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మానస పాల్గొన్నట్టు చెప్పారు. కాగా ఝార్ఖండ్ రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో మానస పాల్గొననన్నారు. క్రీడా పోటీలకు క్రీడాకారుని టీ మానస పాల్గొననున్నారు. పాఠశాల పీఈటీ మహేష్ ప్రోత్సాహంతోనే తాను జాతీయ, రాష్ట్రస్థాయి పోటల్లో పాల్గొన్నట్టు ఆ విద్యార్థిని తెలిపారు. కాగా మానస, పీఈటీ మహేష్‌లను ప్రధానోపాధ్యాయులు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన మానసాను పాఠశాల సిబ్బంది అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
గురువారం | 28 డిసెంబర్ 2023 | www.navatelangana.com

'నోవా ఆసుపత్రి' ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నోవా ఆసుపత్రిని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ.. తక్కువ ఫీజుతో పేదవారికి సేవలందించాలని.. ఇంతవరకు నారాయణఖేడ్లో లేనివిధంగా వైద్యరంగంలో పేదలకు సేవ చేయాలని ఆస్పత్రి యజమాన్యానికి సూచించారు. కాగా ఎమ్మెల్యేను ఆసుపత్రి యజమాన్యం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి యజమాని కౌన్సిలర్ దారం శంకర్, సద్దాం, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు 'సెయింట్ ఆంథోనిస్' విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-సంగారెడ్డి

సదాశివపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 కరాటే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలకు చెందిన కే.శాలిని అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆంథోనీస్ విద్యాసంస్థల చైర్మెన్ సోలమన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. జనవరి 4 నుంచి 12వ వరకు పంజాబ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో శాలిని పాల్గొంటుందని.. అక్కడ కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చివిజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని శాలినికి కళాశాల ప్రిన్సిపాల్ ఈ. జ్యోతి రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జై. బాల రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.చారి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

గొర్రెకల్‌లో 102 ఏండ్ల వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-వట్‌పల్లి



(ఫైల్)

మండలంలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన శతాదిక వృద్ధురాలు పోలీస్ వీరమనేమ్మ(102) మంగళవారం తుదిశ్వాస విడిచారు. వీరమనేమ్మ సుమారు 1920లో జన్మించిందని నేటికీ 102 ఏండ్లకు పైనే తన వయస్సు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. 1970 కంటే ముందు రజాకార్ల ఆగడాలకు ఎదురు నిలిచి.. కరువు కాలంలో గ్రామస్తుల ఆకలి దప్పికలను తీర్చి అక్కున చేర్చుకున్న ఘనత ఆమెకు దక్కిందని పలువురు చెబుతున్నారు. అందరితో మృధు స్వభావిగా ఉంటూ.. కష్టసుఖాలలో తోడుగా నిలిచేదని గుర్తు చేసుకుంటున్నారు. దాంతో ఆమె అంత్రక్రియలకు జనాలు తండోపతండాలుగా వచ్చారు.

గీతం స్కాలర్ సంతోషి ప్రియకు పీహెచ్‌డీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని డి.సంతోషి ప్రియను డాక్టరేట్ వరించింది. 'లిక్విడ్ క్రోమాటో గ్రాఫిక్ పద్ధతులను సూచించే స్థిరత్వం ద్వారా బల్క్, ఫార్ములేషన్స్ కు ఎంపిక చేసిన ఔషధాల విశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఔషధాల విశ్లేషణ కోసం సరళమైన, ఆర్థిక, ఖచ్చితమైన ఐసోక్రటిక్ RP UPLC, LC-MS పద్ధతుల అభివృద్ధిపై ఈ పరిశోధన దృష్టి సారించిందన్నారు. ఈ సద్ధతులు స్వచ్ఛత శాతం, ఔషధాల స్థిరత్వాన్ని అంచనా వేయడానికి వీలు కల్పిస్తాయని, తక్కువ సమయంలో మందులు, నిరుపయోగమైన పదార్థాలను వేరు చేసే సామర్థ్యం కలిగి ఉండి, ఆర్థికంగా లాభదాయకంగా చేస్తుందని తెలియ జేశారు. సంతోషి ప్రియ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదన పు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, విశాఖపట్నం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాజా, నిశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ సోడూరి రామారావు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఆమెను అభినందించారు.

ధరణి భూ సమస్యలను పరిష్కారించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపా ధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు లక్షల రైతు రుణమాఫీ తక్షణమే చేయలన్నారు. స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి జయరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ధరణి భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిన్నింటినీ వెంటనే పరిష్కరించాలని కోరారు. కాగా ధరణిని రద్దుచేసి 'భూమాత' పోర్టల్ తీసుకువచ్చి ప్రజా సమస్యలు పరిష్క రిస్తామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే గతంలో హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. అలాగే రైతులకు రెండు లక్షల రుణ మాఫీని వెంటనే చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారన్నారు. కాబట్టి ఇచ్చిన మాట మీద నిలబడి.. రైతుల భూ సమస్యలు పరిష్కరించండో పాటు.. రెండు లక్షల లోపు రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. యాదవ రెడ్డి, అధ్యక్షులు కే.రాజయ్య జిల్లా నాయకులు యన్. శ్రీనివాస్, ఎస్ మల్లారెడ్డి, అశోక్, ఎండి ల్యాకత్ అలీ, నర్సారెడ్డి, శేఖర్, శ్రీనివాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అభయ హస్తం గ్యారెంటీలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఝరాసంగం

నేటి నుంచి 6 గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని, కావున ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు హనుమంతరావు పాటిల్ అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకమైన మహాలక్ష్మిని నూతన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. మండల కేంద్రంలోని ఎంపీపీ ఛాంబర్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు ప్రజా పాలన కార్యక్రమంలో బుధవారం దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో దరఖాస్తుల కొరత లేకుండా ఎంపీటీసీ, సర్పంచ్‌లు చొరవ తీసుకొని ప్రజా పాలన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్, వైస్ ఎంపీపీ మల్లన్న పాటిల్, ఎంపీటీసీలు మారుతి రావ్, శకుంతల పాటిల్, సర్పంచులు మోహన్ రెడ్డి, రామ్‌రెడ్డి నాయకులు ముల్తానీ, గుండప్పా తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని.. ఈ మేరకు నేటి నుంచి వచ్చే నెల ఆరు వరకు జరిగే ప్రజా పాలనలో దరఖాస్తులు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్హులైన అందరికీ అవగాహన కల్పిస్తూ.. దరఖాస్తుల స్వీకరణకు వచ్చిన అధికారులకు పూర్తి సహాయ సహకారాలను అందజేయాలని పార్టీ కార్యకర్త లకు, నాయకులకు సూచించారు. పలువురు ప్రజా ప్రతినిధులు వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రమాదం ఉందని అందుకే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతీ సమావేశాల వద్ద ఉండి అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుండి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

నేత్రపర్వంగా పౌర్ణమి దీపోత్సవం..

నవతెలంగాణ-ఝరాసంగం

మండలంలోని బర్దిపూర్ దత్తగిరీ ఆశ్రమంలో దత్త జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి నిర్వహించిన దీపోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఈ దీపోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంహెచ్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పల ప్రసాద్ ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. లక్ష దీపోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేసి దీపోత్సవ కార్యక్రమాన్ని వారు ప్రారంభి ంచారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో ఆధ్యాత్మిక ధర్మ సభలో 1992 నుండి అయోధ్యలో బలరాముని పూజిం చిన అక్షింతల ఝరాసంగం, కోహిర్ మండలాలకు చెందిన 76 గ్రామాల రామ భక్తులకు అక్షంతలను పంపిణీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఝరాసంగం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలను నుండే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర, భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం ఉదయం దత్తాత్రేయుడికి పల్లకి సేవ గ్రామ మాడవీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు నిండు కలశములతో పల్లకి స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాల మధ్య సాగిన పల్లకి సేవ కార్యక్రమంలో కర్ణాటక చాంగులేర్ కు చెందిన కళాకారులు చేసిన దండకాలు, ఖడ్గాలు, భజన కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పీఎఫ్ గురించి కార్మికులు అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రతీ కార్మికుడు పీఎఫ్ గురించి అవగాహన కలిగి ఉండాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జీవీరావు అన్నారు. శేరిలింగంపల్లి శివార్‌లో గల అల్యూమినియం పరిశ్రమలో ఈపీఎఫ్ఓ నిధి ఆప్‌కి నికత్, ఈఎస్ఐసి సువిధాన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మిషనరీ దివిసన్ కార్యక్రమంలో కార్మికులు పెన్షనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు,పెన్షనర్లకు అవగాహన కల్పించి.. పిఎఫ్ సమస్యలను పరిష్క రించారు. ఈఎస్ఐసి ఎస్ఎస్ఓ షేక్ జిలాని అహ్మద్ ఈఎస్ఐ గురించి వారికి వివరించారు. ఈఎస్ఐ, పీఎఫ్ పై అవగాహన కల్పించి తమ సమస్యలు పరిష్కరిం చినందుకు కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు పిఎఫ్ కార్యాలయ సిబ్బంది వి.రవీంద్రారెడ్డి, సత్యనారాయణ, ఈ.వి రాజగోపాల్ రెడ్డి, ఆల్ ఐఎన్డి ఇండస్ట్రీస్ ప్రతినిధి ఎస్.డి రామారావు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పొగ మంచులో ప్రయాణం..

ప్రమాదకరం

- చలికాలంలో పరిమితవేగం సురక్షితం
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయి, పొగమంచు దట్టంగా కమ్ముకుని.. ఉదయం 8 గంటలైనా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించని పరిస్థితులు ఏర్పడి అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటున్నదని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత విపరీతంగా పెరిగిందని, రానున్న రెండ్రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత కనిష్ఠ స్థాయికి చేరి, జిల్లాను పొగమంచు కమ్మేసే అవకాశం ఉందన్నారు. దాంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లపై పొగమంచు ఏర్పడటం వలన ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నదన్నారు. వాహనాల నుంచి వెలుపడే పొగ కారణంగా మంచు మరింత దట్టంగా మారుతుందని, వాహనానికి లైట్లు వేసుకున్నా.. కొంత దూరంలో ఉన్న వాహనాలు కూడా దగ్గరకు వచ్చే వరకు కనిపించవన్నారు. ఈ సమయంలో వేగంగా ప్రయాణం చేస్తే యాక్సిడెంట్లు చోటు చేసుకుంటాయన్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పొగమంచు అధికంగా ఉండటం వలన ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఎక్కువ అని తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

తక్కువ బీమ్‌పై హెడ్‌లైట్‌లను సెట్ చేసుకోవాలి. వాయుకాలుష్యం కారణంగా ఎక్కువ దూరాన్ని చూడలేకపోతున్న ఈ రోజుల్లో పొగమంచు వల్ల ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తక్కువ బీమ్‌లో హెడ్‌లైట్‌లను సెట్ చేసుకోవడం మంచిది. హై-బీమ్ హెడ్‌లైట్‌లను ఉపయోగించడం వలన పొగమంచు కాంతికి రిఫ్లెక్ట్ అవుతూ ప్రమాదాలకు దారి తీయవచ్చు. 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న వాహనాన్ని చూడలేని సమయంలో కారు ఫాగ్ ల్యాంప్‌ను ఆన్ చేయడం మంచిది. 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న వాహనాన్ని చూడలేని సమయంలో, సడెన్‌గా వచ్చే వాహనాన్ని చూసి త్వరగా స్పందించలేము. కానీ పరిమిత వేగంలో ప్రయాణి స్తున్నట్లయితే నిజ-సమయ రహదారి పరిస్థితులకు త్వరగా స్పందించవచ్చు. కనిపించని ట్రాఫిక్ శబ్దాలను విని, వాహనాల దూరాన్ని అంచనా వేయండి. పొగమంచు వాతావరణంలో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు చెవులు చురుకుగా పనిచేస్తాయని, దట్టమైన పొగమంచు సమయంలో కళ్ళతో చూడలేని వాటిని చెవులు చక్కగా పని చేసి వాహనాల టైర్ల, హారన్ల శబ్దాలను విని, కనిపించని వాహనాల దూరాన్ని అంచనా వేయడంలో మీకు సహాయ పడతాయి. కాబట్టి, పొగమంచు నుండి డ్రైవింగ్ చేస్తున్న ప్పుడు, మీ సౌండ్ సిస్టమ్ ఆపివేయడం మంచిది. పొగమంచు సమయంలో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఎక్కువ దూరంగా ఉన్న వాహనాలను చూడలేము, ఎవరు, ఎప్పుడు లేన్‌లను మారుస్తున్నారో గుర్తించడం చాలా కష్టం. లేన్ మార్చినట్లైతే ఇతర డ్రైవర్లు బయబ్రాం తులకు గురై ప్రమాదాలకు దారితీయవచ్చు కావున ప్రయాణిస్తున్న లేన్‌ను మార్చొద్దు. మీ ఇండికేటర్స్ ఉపయోగించండి. పొగ మంచుతో కూడిన రహదారిపై డ్రైవింగ్ చేస్తున్నపుడు వాహనాలు సరిగ్గా కనిపించవు. ఇతర డ్రైవర్లకు మనం ఎ వైపు వెళ్ళాలి అనుకుంటున్నామో అన్న ఇండికేషన్ సూచించడం చాలా ముఖ్యం. మలుపు తిరిగే టప్పుడు, కొంత సమయం వెనుక వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా కనీసం పది సెకన్ల పాటు ఇండికేటర్స్ వేయడం మంచిది.

దృష్టిని వీలైనంత స్పష్టంగా ఉంచడానికి వాహనం అద్దాలు క్లీన్ గా ఉండేలా చూసుకోవాలి. కారు హీటర్ ఆన్ చేయాలి. బయటి పొగమంచు వాహనం లోపలి భాగంలో ఘనీభవనానికి కారణమై, డ్రైవర్ దృష్టికి మరింత ఆటంకం కలిగిస్తుంది. కార్ హీటర్‌ను ఆన్ చేయడం ద్వారా దీన్ని సులభంగా క్లియర్ చేయవచ్చు. ఓవర్ టేక్ చేయవద్దు. పొగ మంచు ఉన్న సమయంలో డ్రైవింగ్‌లో సహనం కీలకం. ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించినప్పుడు ఎదుటి డ్రైవర్ ఏకాగ్రత దెబ్బతిని రోడ్డు ప్రమాదానికి కారణం కావొచ్చు. వాహనానికి, వాహనానికి మధ్య పరిమిత దూరన్ని పాటించాలి. ముందున్న వాహనానికి మధ్య పరిమిత దూరన్ని పాటించడం చాలా ముఖ్యం. వాహనాలు ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉన్నపుడు అత్యవసర సమయంలో ప్రతిస్పందించ డానికి తగినంత సమయం లేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయి. పొగమంచు సమయంలో డ్రైవింగ్ పై ఏకాగ్రత, అప్రమత్తంగా ఉండటం అత్యంత ప్రాధాన్యం.

జహీరాబాద్‌లో కమ్మేసిన పొగమంచు

ఎక్కడికక్కడ స్తంభించిన వాహనాలు



నవతెలంగాణ-జహీరాబాద్

వాతావరణంలో మార్పు కారణంగా బుధవారం ఉదయం 8 గంటల వరకు జహీరాబాద్‌ను పొగ మంచు కమ్మేసింది. రోడ్డు కూడా సరిగ్గా కనపడకపోవడంతో.. వాహనాలన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉదయం 8 గంటల వరకు పొగ మంచు కమ్మేస్తుండడంతో.. ప్రయాణికులతో, విద్యార్థులు, ఉద్యోగస్తులు, కార్మికులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. కాగా ఇలాంటి పొగ మంచులో బయట తిరగకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు పొగమంచు సమయంలో వాకింగ్, వ్యాయామాలకు వెళ్లకుండా ఇంట్లో ఉండడమే మంచిదని చెబుతున్నారు. ప్రయాణికులు కూడా తమ వాహనాలను రోడ్డు పక్కలో నిలుపుకుంటే మంచిదని.. నిలిపిన సమయంలో పార్కింగ్ లైట్లు వేసిఉంచాలని అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పుతోనే ఈ పరిస్థితి నెలకొన్నదని.. కొన్ని రోజులు జాగ్రత్తలు తీసుకోక తప్పదని పలువురు సూచిస్తున్నారు.

'ప్రజాపాలన'కు సర్వం సిద్ధం

నేడు ప్రారంభమై జనవరి 6వ తేదీ వరకు నిర్వాహణ.. బుధవారం నాడూ సమీక్షా సమావేశాలు

సంగుపేట 'ప్రజాపాలన'లో పాల్గొననున్న మంత్రి..!

నవతెలంగాణ-జోగిపేట

ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాస్తులు స్వీకరించేందుకు మండలంలో గ్రామసభలు నిర్వహిం చినట్లు అందోల్ ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. నేడు అల్మాయిపేట, సంగుపేట, మన్‌సాన్‌పల్లి, రోళ్లపాడ్, 29న సాయిబాన్‌పేట, చందంపేట, చింత కుంట, అన్నసా గర్, 30న పోతిరెడ్డిపల్లి, కొండరెడ్డిపల్లి, మాసాన్‌పల్లి, పోసానిపేట, 02న కన్‌సాన్‌పల్లి, నేరడిగుంట, తాలెల్మ, తాడ్మన్నూర్, 3న డాకూర్, ఎర్రారం, అక్సాన్‌పల్లి, బ్రహ్మణ పల్లి, 04న రాంసాన్‌పల్లి, కిచ్చన్నపల్లి, కొడెకల్, నాదులాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. అయితే నేడు మండలంలోని సంగుపేట గ్రామంలో నిర్వహించే గ్రామ సభకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

నవతెలంగాణ- జిన్నారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమ నిర్వహణకు అన్ని మండలాల్లో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులు సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి.. ప్రజాపాలన కార్యక్రమంపై సూచనలు చేశారు. ఆ మేరకు అధికారులు, ప్రజాప్రతిని ధులు ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. కాగా నేడు(గురువారం) ఈ కార్యక్రమం ప్రారంభమై.. వచ్చేనెల 6 వరకు కొనసాగనున్నది.

జిన్నారం మండలంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ రాములు, జిన్నారం తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మొదటి రోజైన గురువారం గడ్డపోతారం, అండూరులో, 29న శివానగర్, కాజిపల్లి, 30న రాళ్లకత్వ, జిన్నారం, జనవరి 2న సోలక్పల్లి, మంగంపేట్, 3న లక్ష్మీపతి గూడెం, మాదారం,4న కొడకంచి, వావిలాల్ ఐదున ఊట్ల, నల్తూర్,6న జంగంపేటలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మండలంలోని గ్రామపంచాయతీలను రెండు టీములుగా విభజించి జిన్నారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు గడ్డపోతారం, లక్ష్మీపతి గూడెం, వావిలాల, నల్తూర్, కాజిపల్లి, మంగంపేట రాళ్లకత్వ జంగంపేట గ్రామాలను పర్యవేక్షించనున్నారు. అలాగే జిన్నారం మండల తాసిల్దార్ రవికుమార్ అండూర్ శివానగర్ కొడకంచి మాదారం ఊట్ల, సోలక్‌పల్లి, జిన్నారంలో జరిగే గ్రామ పంచాయతీలు వారి ప్రజా పాలన కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

జోగిపేట : నేటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 20 వార్డులో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, కమీషనర్ తిరుపతిలు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాసభ్యుల నుంచి పలు సూచనలు సలహాలు తీసుకున్నారు. కార్యక్రమాలు ఏ విధంగా అమలు చేస్తే బాగుంటుందోనని చర్చించారు. మున్సిపల్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తీర్మానించారు. ప్రజా పాలన కార్యక్రమం నేడు 1,2,3 వార్డులలో, 29న 4,5,6 వార్డుల్లో, 30న 7,8 వార్డుల్లో, జనవరి 02న 9,10,11 వార్డుల్లో, 03న 12,13 వార్డుల్లో, 04న 14,15,16 వార్డుల్లో 05న 17,18 వార్డుల్లో, 06న 19,20 జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ ప్రవీణ్, కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, డి.శంకర్, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, పి.రేఖ, హరిక్రిష్ణ గౌడ్, ప్రవీణ, మాధవి, నాగరాజు,సురేష్,దుర్గేష్, చందర్‌నాయక్, జాకియా సుల్తానా, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావు దేశముఖ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని మాణిక్‌ప్రభు మందిర్ వద్ద గల కమ్యూనిటీ హాల్‌లో, ఆశిర్ఖానాలో, ముస్లిం షాది ఖానాలో, గణేష్ టెంపుల్ మున్సిపల్ పార్కుల్లో ప్రజా పాలన కార్యక్రమం కోసం కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కాబట్టి ప్రజలు తమ పరిధిలోని ఆయా కౌంటర్లలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ దీప్తి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : మండలంలో నేటి నుంచి ప్రజా పాలన కొనసాగనుండగా.. ఇందుకు సంబంధిత అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. కాగా మండలంలోని దేవనూర్, పాలడుగులో నేడు(గురువారం), షాద్నగర్ అలియాస్ గట్టుపల్లి, పల్వట్లలో ఈనెల 29న(శుక్రవారం), గొర్రెకల్, సాయిఎటలో ఈనెల 30న, వచ్చేనెల 2న బిజిలిపూర్, కేరూర్‌లో, 3న మరువెల్లి, మేడికుంద, గౌతాపూర్‌లో, 4వ తేదీన ఖాదింాబాద్, నాగులపల్లి, దుద్యాలలో, 5న మంచిర్యాల తండా, పోతులబొగుడ, వట్పల్లిలో, 6వ తేదీన నిర్జప్లా, దరఖాసుపల్లి, ఉసిరికపల్లి, బూత్కూర్ గ్రామాల్లో కొనసాగనున్నది.

గుమ్మడిదల : మండలాభివృద్ధి కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులతో కలిసి ఎంపీడీవో చంద్రశేఖర్.. ప్రజా పాలనపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు సంబంధించి.. నేటి నుంచి ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు తీసుకోవాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నేడు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నదని.. అందుకు సంబంధించి ఆయా పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్లకు సమాచారం ఇచ్చి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్ దయాకర్ రావు, సర్పంచులు, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా ప్రజా పాలన అభయహస్తం గ్యారంటీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని స్థానిక తహసిల్దార్ సంజీవ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి సమావేశ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో, వివిధ శాఖల అధికారులతో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కొరకు ఒకే దరఖాస్తు ఫారాన్ని ఫిలప్ చేయాల్సి ఉంటుందన్నారు. మండలంలో రెండు టీములు పనిచేస్తాయన్నారు. ప్రతి రోజు 4 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల నుండి దరఖాస్తులు తీసుంటారన్నారు. నేటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. గ్రామంలో మరుసటి రోజు జరిగే గ్రామ సభకు టామ్ టామ్ చేయించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్, వైస్ ఎంపీపీ మల్లన్న పాటిల్, ఎంపీటీసీలు,సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.















ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీఓ



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా పాలన' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వెంకటొరెడ్డి అన్నారు. మండలంలోని చిరాకుపల్లి గ్రామంలో నేటి(గురువారం) నుంచి జరగబోయే ప్రజా పాలన కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుతోపాటు.. వచ్చిన వారికి అసౌకర్యాలు కలగకుండా తగు చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులందరినీ సమన్వయపరిచారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, చిరాకుపల్లి సర్పంచ్ నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలోని కన్వెన్షన్ హాల్‌లో అభ్యుదయ ఆర్ట్స్ వారు చేపట్టిన 'సంఘం శరణం గచ్చామి' అంబేద్కర్ జీవిత ఘటనలపై సన్నివేశాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ చిన్నప్పటి నుంచి ఆటల్లో, చదువులో, ఉద్యోగంలో ఎదుర్కొన్న అనేక వివక్షలను కండ్లకు కట్టినట్టు చూపి ంచారు. ఈ నాటక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారులు హాజర య్యారు. నాటకాన్ని వీక్షించి మాట్లాడుతూ.. కుల వివక్ష నిర్మూలన, దేవాలయంలోకి ప్రవేశం, మంచినీళ్ల కోసం, రిజ ర్వేషన్ల కోసం అంబేద్కర్ చేసిన పోరాటాలను అద్భుతంగా చూయించారన్నారు. అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకు ని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్య క్రమంలో సోషల్ వెల్ఫేర్ సూపరిడెంట్ వార్డెన్లు చందా శ్రీని వాస్, రవికుమార్, రాములు, కిషన్, ప్రజాసంఘాల నాయ కులు, కేవీపీఎస్ నర్సింలు, కాన్షిరాం చిరంజీవి, శివాజీ, ప్రశాంత్, రాజకుమార్, సంజీవులు, నరేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన ఉమ్మడి మెదక్ జిల్లా (సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట) జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ,అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇందుకు తమ సహకారం ఉంటుందన్నారు. మీరు అమలు చేసిన రెండు హామీలకు పూర్తి సమయం ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు.సంగారెడ్డి నుంచి పటాన్చెరు వరకు పది బస్సులు ఉంటే అందులో అద్దెకు తీసుకున్న ఆరు బస్సులు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. ఆర్టీసీ బస్సులు పెంచి, బస్సుల కొరత లేకుండా చూడాలని చింతా ప్రభాకర్ కోరారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ నీలకంఠం



నవతెలంగాణ-మెదక్

హవెలీఘణపూర్ మండల పరిధిలోని తిమ్మాయిపల్లి పాఠశాలను మండల విద్యాధికారి నీలకంఠం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 6, 7, 8వ తరగతులతో ఉన్నతి కార్యక్రమం ప్రకారం బోధన అమలవుతుందా అని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను వారి ప్రగతిని పరిశీలించారు. అక్షయపాత్ర ద్వారా అమలు అవుతున్న మధ్యాహ్న బోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. మండల విద్యాధికారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.ప్రమోద్ కుమార్, ఉపాధ్యాయులు దయానందం, మహేశ్వర్ ఉన్నారు.

ప్రభుత్వ గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



నవ తెలంగాణ-కౌడిపల్లి

సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా నాయకుడు చంద్రం కృష్ణ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రతి గ్రామంలో 6 గ్యారంటీల కోసం అధికారులు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో గృహలక్ష్మి, రైతు భరోసా, మహాలక్ష్మి, చేయూత, రేషన్ కార్డులు, గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామసభల్లో పాల్గొని ప్రభుత్వం నుంచి అందించే దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పని చేయాలని తెలిపారు. ఈ నెల 30న కౌడిపల్లిలో జరిగే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామాలలో ప్రతి ఇంటికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలు అందే విధంగా కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామ సభలో పాల్గొనే అధికారులకు, గ్రామస్తులకు సహాయాన్ని అందించాలని కోరారు.

కొడుకులకు గ్రీన్ కార్డులు..తల్లిదండ్రులకు రేషన్ కార్డులు

- అసలైన పేదలు, నిరుపేదలకు రేషన్ కార్డులే లేవు
- దారిద్రరేఖకు దిగువన ఉన్న వారికే రేషన్ కార్డులు ఇవ్వాలి

నవతెలంగాణ-నిజాంపేట

కేంద్ర ప్రభుత్వం దారిద్రరేకకు దిగువన ఉన్నవారికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు అదేమీ పట్టించుకోవడం లేదు. ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు వారి రాజకీయాల కోసం వాడుకుంటూ ఇష్టం వచ్చిన రీతిగా వ్యవహరిస్తూ వారికి అనుకూలంగా ఉన్న ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడం జరిగింది. అసలైన పేదలు నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని రోగాలకు ఒకటే మందు అనే విధంగా ప్రభుత్వాలు తెల్ల రేషన్ కార్డుకు లింకు పెడుతుంటే తెల్ల రేషన్ కార్డు లేని లబ్ధిదారులు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడి గ్రీన్ కార్డులు సంపాదించుకున్న వారి తల్లిదండ్రులకు గ్రామాలలో తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. వాళ్లకు కోట్లలో ఆస్తులు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు వారికే కొమ్ము కాస్తున్నాయనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. పెట్రోల్ బంకులు, అపార్ట్మెంట్లు, రైస్ మిల్లులు, ఫంక్షన్ హాలు, రియల్ ఎస్టేట్ ప్లాట్లు ,చెప్పుకుంటూ పోతే ఇలా అనేక ఆస్తులు ఉన్నప్పటికీ వారికి తెల్ల రేషన్ కార్డులు ప్రభుత్వం ఇవ్వడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలైన పేదవారికి మాత్రం రేషన్ కార్డు లేక సతమతమవుతుంటే ఒక పక్క ప్రభుత్వం అన్నింటికి రేషన్ కార్డు మూలం అంటూ లింకులు పెడుతున్నది. నిజాంపేట మండలంలో ఎంతోమంది నిరుపేదలు ఉన్నప్పటికీ వారికి తెల్లరేషన్ కార్డులు లేక దాదాపు పది సంవత్సరాల నుంచి ప్రజలు సతమతమవుతున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొత్త కొత్త ఆలోచనలు చేస్తున్నది బాగానే ఉన్నప్పటికీ అందులో భాగంగానే గతంలో తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేసిన వాటిని పూర్తిగా ప్రక్షాళన చేసి అసలైన పేదలు నిరుపేదలను గుర్తించి తెల్ల రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయానికి గండి పడకుండా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి అసలైన నిరుపేదలకు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేసేలా తగు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మెదక్

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కసరత్తులో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, జిల్లాలో జనాభా ప్రతిపాదికన పోలింగ్ కేంద్రాల పెంపు లాంటి అంశాలపై రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయం పరిగణలోకి తీసుకుంటామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు. జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. జనవరి 5 వరకు నమోదు, 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల, జనవరి 22 వరకు అభ్యంతరాల క్లెయిమ్స్ స్వీకరణ, ఫిబ్రవరి 2వ తేదీలోగా క్లెయిమ్స్ పరిష్కారం ఫిబ్రవరి 8న తుదిజాబితా వెలువడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు శ్రీనివాస్, నర్సింలు, నర్సింహులు, అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-నార్సింగి

కాంగ్రెస్ ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీల అమలుకు గాగ్రామ సభల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కాంగెగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ సూచించారు. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలలో రెండు అమలు జరిగాయని, మిగతా పథకాల అమలు కొరకు డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రతిరోజు గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నారని తెలిపారు. కావున ప్రతి కాంగ్రెస్ కార్యకర్త దగ్గరుండి ప్రజలకు అన్ని పథకాలను అందజేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, సంతోష్, టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశవులు, జప్తి శివునూర్ గ్రామ అధ్యక్షుడు చాంద్ పాషా, బాల్ రాజ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి బాచి, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, ఫిషర్మెన్ అధ్యక్షుడు సుధాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ కుమార్, జహీర్, రాములు నాయక్, నర్సంపల్లి గ్రామ అధ్యక్షుడు అన్వర్, ఇమ్రాన్, శ్రీనివాస్, కిష్ట రాములు, దాస్, సంతోష్, శ్రీధర్, కిషన్, అస్లమ్ తదితరులు పాల్గొన్నారు

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్



నవతెలంగాణ-నిజాంపేట

రాష్ట్ర ప్రభుత్వం 28 నుంచి నిర్వహిస్తున్న గ్రామ సభలను దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో గ్రామసభలను నిర్వహించడాన్ని దళిత బహుజన ఫ్రంట్ ఆహ్వానిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం, ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు తీసుకోవడం మంచి పరిణామమన్నారు. గత పదేళ్లుగా అధికారులు గ్రామ ప్రజలకు దూరంగా ఉండడంతో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామసభలకు ముందు రోజే అధికారులు దరఖాస్తు ఫారాలను ప్రజలకు ఇస్తారన్నారు. మీ సేవల చుట్టూ ప్రజలు తిరగకుండా తమ ఆధార్ కార్డు రేషన్ కార్డు ఇతర ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జత చేసి సమర్పించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు రసీదు తప్పకుండా తీసుకోవాలన్నారు గ్రామసభలను హడావిడిగా కాకుండా ప్రణాళికబద్ధంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్వహించి గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు. రేషన్ కార్డు లేని వారు తెల్ల పేపర్ మీద జనరల్ కౌంటర్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామసభల సమాచారాన్ని అధికారులు టామ్‌టామ్ ద్వారా ప్రచారం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, మండల ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొమ్మాట బాబు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసినవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పోలీస్ స్టేషన్‌లో దళిత సంఘాల ఫిర్యాదు



నవ తెలంగాణ-నర్సాపూర్

దళితులపై అకారణంగా దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎస్సై శివకుమార్‌కు దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు సంజీవ్, కడారి నాగరాజు, భిక్షపతి, నరేష్, రాంచందర్ లు మాట్లాడుతూ నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో గత 4 రోజులుగా గ్రామంలో పోచమ్మ జాతర జరుగుతుందన్నారు. అయితే ఈ క్రమంలో మంగళవారం రాత్రి దళితులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డీజే సౌండ్స్‌తో ఆడుతుండగా కొంత మంది ముదిరాజు కులానికి చెందిన వ్యక్తులు అకారణంగా దళితులపై అసభ్యకరంగా దుర్భాషలాడుతూ దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు కోరారు. గ్రామాన్ని డి.ఎస్.పి వెంటనే సందర్శించి విచారణ జరపాలని వారు కోరారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీకాంత్, నర్సింలు, మధు శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకే పూర్తి బాధ్యతలు ఇవ్వాలి

- రెండు సంవత్సరాలు కరోనాలోనే గడిచిపోయాయి
- గ్రామల అభివృద్ధిలో పోటీతత్వంతోనే పనులు చేశాం
- రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్‌ముదిరాజ్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామాల అభివృద్ధిలో ఇతర సర్పంచ్‌లను దృష్టిలో పెట్టుకుని పోటీ తత్వంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడ్డామని, సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించే వరకు ఉన్న సర్పంచ్‌లనే తిరిగి సర్పంచ్‌లుగా బాధ్యతలు నిర్వహించే విధంగా పూర్తి బాధ్యతలను ఉన్న సర్పంచ్‌లకే ఇవ్వాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్ కోరారు. బుధవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము గత ఐదు సంవత్సరాల క్రితం 2019లో ఫిబ్రవరి 2న సర్పంచ్‌లుగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. అనంతరం ఎనమిది నెలలు చెక్ పవర్‌కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. అనంతరం చెక్ పవర్ వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టగానే కరోనా మహమ్మారి వచ్చి పడడంతో రెండు సంవత్సరాలు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా పోయామన్నారు. అలాగే గత ప్రభుత్వం తాము చేసిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని దానిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అధికారి పాలన కాకుండా తిరిగి ఎన్నికలు వచ్చే వరకు తమనే సర్పంచ్‌లుగా పూర్తి బాధ్యతలతో కొనసాగించాలని కోరారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఈ ప్రభుత్వమైనా అందజేసి తిరిగి ఎన్నికలు వచ్చే వరకు తమకే పూర్తి బాధ్యతలను ఇచ్చి మిగిలి ఉన్న అభివృద్ధి పనులను చేపట్టే విధంగా అవకాశం కల్పించాలని నత్తి మల్లేష్ ముదిరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగభూషణం, నర్సయ్య, నాయకులు పంజా భిక్షపతి, చింతల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన



నవతెలంగాణ-నర్సాపూర్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన కల్పించామని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. ఈ సమావేశంలో నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహించే ప్రజాపాలన సభల గురించి చర్చించడం జరిగిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో నిజమైన లబ్ధిదారులను గుర్తింపు కోసం దరఖాస్తుల పంపిణీ, దరఖాస్తులు నింపే విధానంతో పాటు ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు కోసం చర్చించారు. అయితే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురువారం ఉదయం 8 గంటలకు ఒకటవ వార్డు హనుమంతపూర్‌లో, 10 గంటలకు, రోషిని స్కూల్ జగనతరావు కాలనీ వద్ద, రెండు గంటలకు రెండవ వార్డు ఎన్జీవోస్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద ప్రజాపాలన వార్డు సభ్యులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్



నవతెలంగాణ-నర్సాపూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్‌లు కోరారు. నర్సాపూర్ ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు మహాలక్ష్మి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత , అభయ హస్తం పథకాలను ప్రజలకు అందించేందుకు నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు ఆయా గ్రామాలకు అధికారులు వచ్చి గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు . ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఆయా గ్రామాలలోని ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు సహకరించాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన కార్యక్రమానికి స్వీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, కాగజ్ మద్దూర్ సర్పంచ్ శివకుమార్, నాయకులు ఉదయ్ కుమార్, సురేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

వైభవంగా స్వామి ఆభరణాల ఊరేగింపు

- ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ
- పాల్గొన్న ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో దుర్గాప్పగారి అశోక్ గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఆభరణాల ఊరేగింపు పట్టణంలోని శివాలయం నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అయ్యప్ప దీక్ష స్వాముల భజనలు, ఆట పాటలతో సాగి నర్సాపూర్ హైదరాబాద్ ప్రధాన రోడ్డులో గల పందివాగ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం వరకు సాగింది. ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహాలను ప్రతిష్టించి ఆభరణాలను అలంకరించి అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయంలో మొట్టమొదటగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ చేయడం అభినందనీయమన్నారు. అయ్యప్ప స్వాములకు, ప్రజలకు అష్టైశ్వర్యాలు ఇచ్చి సుఖ సంతోషాలతో ఉంచాలని ఆమె అయ్యప్ప స్వామిని కోరారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం చేపట్టిన అయ్యప్ప స్వాముల భిక్ష కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష బూనిన స్వాములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు. నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 12న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరపత్రాలు విడత

నవతెలంగాణ-నర్సాపూర్

ఉచిత విద్య, ఉపాధి కల్పన కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జనవరి 12న నిర్వహించ తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ అన్నారు. బుధవారం చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు అందరికీ ఉచిత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్లో విద్యారంగానికి మూడు శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నారని విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని ఆయన కోరారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందని కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న మాట ఎక్కడని ఆయన ప్రశ్నించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నిరసనలు వ్యక్తం చేసిన విద్యార్థులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే జనవరి 12న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నర్సాపూర్ డివిజన్ నాయకులు మహేందర్, రవి, కిరణ్, రాజు, బాలరాజు, నితీష్ తదితరులు పాల్గొన్నారు.





ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

గ్రామ సభలను విజయవంతం చేయాలి

- ప్రజా పాలనపై ప్రజాప్రతినిధులకు అవగాహన
- నేటి నుంచి 6 వరకు గ్రామ సభలు





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలపై చేపట్టిన గ్రామ సభలను సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ నర్సింలు, తహశీల్దార్ శ్రీనివాస్‌రావ్‌లు కోరారు. బుధవారం మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. దరఖాస్తు పత్రాన్ని ప్రభుత్వమే అందజేస్తుందని, దానిని జిరాక్స్ తీసి ఇచ్చినా అది చెల్లదన్నారు. ఎవరికి ఇచ్చిన దరఖాస్తును వారు మాత్రమే అందజేయాలని సూచించారు. ఆరు గ్యారెంటీల పథకాలకు సంబంధించి నేటి నుంచి జనవరి 6 వరకు గ్రామ సభలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు ప్రజా పాలన గ్రామ సభలలో దరఖాస్తును చేసుకుని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీడీవో సూపరెండెంట్ కృష్ణమూర్తిలతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

4

సిద్దిపేట

గురువారం | 28 డిసెంబర్ 2023 | www.navatelangana.com

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎడ్యుకేషన్ హబ్‌లో ఈ విద్యా సంవత్సరం కామర్స్ సబ్జెక్ట్ బోధించడానికి అతిథి అధ్యాపకులు కావాలని ఆసక్తి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంబంధిత సబ్జెక్టులలో ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతంతో, బీసీ, ఓసీ లైతే 55 శాతంతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నెట్,సెట్ పాసైన వారికి, పిహెచ్. డి. పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11-00 గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు అన్ని ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీతో హాజరు కావాలని పేర్కొన్నారు.

లైసెన్స్ లేకుండా చికిత్స చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట



ఆర్ఎంపీ ట్రైనింగ్ సర్టిఫికెట్ లైసెన్స్ లేకుండా, శాంపిల్ మెడిసిన్స్ ఇస్తున్న నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండల వాడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ విషయం పై డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి తనిఖీ చేసి, వెంటనే ప్రథమ చికిత్స కేంద్రాన్ని మూసి వేయించారని తెలిపారు. అయినా అతను ఆ ప్రథమ చికిత్స ఆలయాన్ని తెరిచి మళ్లీ ప్రాక్టీస్ చేస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ రూరల్ మండల అధ్యక్షుడు గ్యార రఘుపతి, నాయకులు తరుణ్, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోమా రెస్టారెంట్ అదరహో !

- వినూత్న పద్ధతిలో రెస్టారెంట్ నిర్వహణ
- పచ్చని ప్రకృతి వాతావరణంతో జనాకర్షణ
- స్వయం ఉపాధితో పాటు 20 మందికి ఉపాధి
- రోజురోజుకు పెరుగుతున్న జనాఆదరణ





నవతెలంగాణ-వర్గల్



వర్గల్ మండల ప్రజలకు ఎప్పుడైనా బయట తినాల్సివస్తే ముందుగా గుర్తొచ్చే రెస్టారెంట్ గ్రీన్ ఆరోమా. పేరుకుతగ్గట్టే ఈ రెస్టారెంట్‌లో పచ్చటి చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు కమ్మటి వాసనలు వచ్చే రుచికరమైన ఆహారం ఉంటుంది. ఇంతటి విశిష్టత కలిగిన ఈ రెస్టారెంట్ నిర్వహణ వెనుక ఒక కథ ఉన్నది అదేంటో చూద్దామా మరి..!

జగదేవ్‌పూర్ గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన రఘుపతి రెడ్డి, సులోచన దంపతుల రెండో కుమారుడు సతీష్‌రెడ్డికి చిన్నప్పటి నుండి వ్యవసాయం అంటే ఇష్టం. వ్యవసాయంపై మక్కువతో విత్తన కంపెనీలో విత్తన పరిశోధన విభాగంలో ఏడు సంవత్సరాలు పని చేశారు. తాను పని చేసే కంపెనీ హైదరాబాద్ సమీపంలో ఉండేది. తాను ఉద్యోగం చేసే రోజుల్లో వర్గల్ మండలంలోని గౌరారం రాజీవ్ రహదారి మీదుగా రోజు వెళ్లేవారు. కొన్ని సందర్భాల్లో మార్గమధ్యంలో భోజనం చేయాల్సి వస్తే దగ్గరలోని రెస్టారెంట్లు, హెూటల్లో భోజనం చేసేవారు. ఎన్ని హెూటళ్లలో భోజనం చేసిన తృప్తి ఉండేదికాదు. ఎదో కోల్పోతున్నాం అనే భావన ఉండేది. అప్పుడే తనకు ఓ ఆలోచన వచ్చింది.

వర్గల్ పరిసర ప్రాంతాల్లో మంచి రెస్టారెంట్ లేదు. నాణ్యమైన ఆహారం అందిస్తే బాగుంటుందని నిర్ణయించుకుని గౌరారం రాజీవ్ రహదారి ఒక్కనే ఉన్న ఓ ఖాళీ స్థలాన్ని ఎంపిక చేసుకుని రెస్టారెంట్ ప్రారంభించారు. సతీష్‌కు చిన్నప్పటి నుండి చెట్లు, ప్రకృతి, మూగాజీవలు, వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతోనే వారు ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌లో పచ్చటి చెట్లతో కూడిన వాతావరణం ఉండేలా ఏర్పాటు చేశారు. వాతావరణానికి తగ్గట్టుగానే గ్రీన్ ఆరోమా అనే పేరు పెట్టారు. ఇక్కడి రెస్టారెంట్ లో వివిధ రకాల జంతువులు అరుదైన మొక్కలతో ఆకర్షణీయంగా అందరిని ఆకట్టుకుంటాయి. కొన్ని ప్రత్యేకమైన అలంకరణ వస్తువులుతో అలంకరించారు.

ప్రారంభంలో బాలారిష్టాలు ఎన్నో ఎదుర్కొని..

ఎన్నో వ్యయప్రయసాలకు ఓర్చుకొని రెస్టారెంట్‌ను 2019 సంవత్సరంలో ప్రారంభించారు. రెస్టారెంట్ ప్రారంభించిన కొత్తలో స్థానిక అల్లరిమూకలు వచ్చి గొడవలు చేసేవారు. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించే వారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని తమ సోదరులైన సంతోష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి సహాయ సహకారలతో ఎన్నో ఇబ్బందుల ను ఎదుర్కొని ప్రస్తుతం విజయవంతంగా రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు.



> **అభివృద్ధి చేయాల్సింది చాలా ఉంది**
>
> 2019లో రెస్టారెంట్ ప్రారంభించాం. రెస్టారెంట్ నిర్వహణతో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. కస్టమర్ల సలహాలు సూచనతో ఇంకా అభివృద్ధి చేస్తాం. ఇప్పటివరకు ఇంతోమంది కస్టమర్ల మన్ననలు పొందాయి. రోజుకు సుమారు 300 నుండి 400 మంది మా రెస్టారెంట్‌ను సందర్శిస్తారు. వారిలో ఎక్కువ మంది రెస్టారెంట్ నిర్వహణ బాగుందనే కితాబు ఇస్తున్నారు. భవిష్యత్‌లో ఇంకా బాగా అభివృద్ధి చేసి కస్టమర్లను సంతృప్తిపరుస్తాం.
>
> 
>
> - సతీష్‌రెడ్డి, ఆరోమా రెస్టారెంట్ నిర్వాహకులు

వినూత్న ప్రయత్నాలతో జనాకర్షణ

ఈ రెస్టారెంట్ లో ఆహారంతో పాటు ఆహ్లాదం ఉంటుంది. చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులు ఉన్నాయి. భోజనశాల వినూత్న పద్ధతిలో కలపతో తయారు చేసిన బల్లలు ఉన్నాయి. రంగురంగుల విద్యుత్ కాంతులు వెదజల్లే లైటింగ్ ఉంటుంది. అలాగే పెద్ద సైజులో టి.వి స్క్రీన్ ఏర్పాటు చేశారు. రెస్టారెంట్ ఆవరణలో పల్లె వాతావరణ ఉట్టిపడేలా ఎడ్లబండ్లు, పెద్ద మట్టి పాత్రలను అలకరంగా ఏర్పాటు చేశారు ! వచ్చిన కస్టమర్ కి ఇష్టమైన నాణ్యమైన ఆహారం అందించడం తమ బాధ్యతగా భావించి ఫుడ్ ని సర్వ్ చేస్తారు.

ప్రజాపాలన సజావుగా సాగాలి



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమం సజావుగా జరగాలని గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలకు సర్పంచ్ ద్యావనపల్లి మంజుల సూచించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలనపై సర్పంచ్ దేవనపల్లి మంజుల సమీక్ష సమావేశం నిర్వహించారు.పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, సౌమ్య, రేణుక, రజిత, అంగన్వాడీ ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది హాజరయ్యారు.

ప్రజా ప్రతినిధులపై వ్యాఖ్యలు సరికాదు

జెడ్పీటీసీ కనగండ్ల కవిత ఆరోపణ


నవతెలంగాణ-బెజ్జంకి



ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనాార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ప్రజాసంఘాల నాయకులు మాట్లాడటం ప్రజలపై వ్యాఖ్యలు చేయడమేనని జెడ్పీటీసీ కనగండ్ల కవిత బుధవారం ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు రాజ్యాంగబద్ధంగా ఎన్నికయ్యారని, ప్రజా సంఘాల నాయకుడిగా, ఆర్టీఐ చైర్మన్‌గా వ్యవహరిస్తూ ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగాన్ని అగౌరవపరచడమేనని అన్నారు. ఇటీవల మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజా ప్రతినిధేనని మర్చిపోయి వాఖ్యలు చేయడం వారి విజ్ఞతకు నిదర్శనమని అసహనం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రజలకు అనుకూలంగా ప్రజా ప్రతినిధులు పని చేస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల అమలు చేయడంలో కాంగ్రెస్ శ్రేణులు శ్రద్ధ వహించాలని హితవు పలికారు.

ప్రజాపాలనలో ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలి

నవతెలంగాణ-బెజ్జంకి



నేటి నుండి జనవరి 6వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముకీసా రత్నాకర్ రెడ్డి బుధవారం సూచించారు. గత తొమ్మిదేళ్లుగా అర్హులైన ప్రజలు సంక్షేమ పథకాల్లో పారదర్శకంగా లబ్ధిదారులగా ఎంపికవ్వడం కోసం కాంగ్రెస్ శ్రేణులు దోహదపడాలని రత్నాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో ఎస్.జి.ఎఫ్ లో జిల్లా విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన



నవతెలంగాణ - సిద్దిపేట

ఈనెల 21 నుండి 23 వరకు వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఎస్.జి.ఎఫ్ అండర్ 14, 17 బాల బాలికల టోర్నమెంట్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 8 పతకాలు సాధించారని సిద్దిపేట జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అండర్ 14 విభాగంలో పి. పురందర గోల్డ్ మెడల్, ఈ.నిశాంత్, జె.రోహన్ చంద్ర సిల్వర్ మెడల్స్, ఎం. అమృత, పి. వినయ్, ఎం.విజయ్ బ్రాంజ్ మెడల్స్ సాధించారని, అండర్ 17 విభాగంలో కే. లోకేష్, కె.చరణ్ దీప్ సిల్వర్ మెడల్స్ సాధించారనీ తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన పురందర ఈనెల 30 నుండి జనవరి 5 వరకు మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో ఎస్. జి. ఎఫ్ పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తైక్వాండో విద్యార్థులను అభినందించారని, జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన పురందరను జాతీయస్థాయిలో మెడల్ సాధించి సిద్దిపేటకు మంచి పేరు తీసుకురావాలని సూచించినట్లు తెలిపారు.

మాదిగ కుల పెద్ద (సదర్)గా రామగళ్ల నాగరాజు ఎన్నిక



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ మాదిగ కుల సంఘ సభ్యుల సమావేశం బుధవారం పట్టణ కేంద్రంలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల మాదిగ కుల పెద్ద(సదర్)గా రామగళ్ల నాగరాజును ఎన్నుకున్నారు. సమావేశంలో మాదిగ కుల పెద్దలు ముస్త్యాల బాల నరసయ్య, ముస్త్యాల కిష్టయ్య, భూమిగారి ప్రభాకర్, మల్లిగారి నర్సింహులు, భూమిగారి సంజీవులు, మల్లిగారి యాదగిరి, మల్లిగారి సూరయ్య, కొమ్ము నర్సయ్య, మల్లయ్య, కర్రోళ్ల నవజీవన్, భుమిగారి రాజేందర్, భూమిగారి దామోదర, రామగళ్ల జూకయ్య, బస్వగల్ల నవీన్, మల్లిగారి రాజేష్, సర్వగల్ల నర్సయ్య, దేవయ్య, భూమిగారి మహేందర్, ఎర్రోళ్ల రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో విశ్వ విద్యాలయం



నవతెలంగాణ-సిద్దిపేట

అరచేతిలో విశ్వ విద్యాలయం ఉందని, 46 కోర్సుల్లో యాప్ ద్వారా ఉచిత ఆన్లైన్ శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలను అందిస్తుందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహ్మద్ విఖార్ బాబా విద్యార్థులకు సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లాలో నమోదై ఉన్న కార్మికుల పిల్లలకు ఉచిత కెరీర్ గైడెన్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం స్వయం ఉపాధికి నైపుణ్యాభివృద్ధికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. సెట్విన్ మరియు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. సంస్థ ఉచితంగా ఇచ్చే విద్యా కోర్సులను వినియోగించుకొని మంచి భవిష్యత్తు పొందాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 185 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కర్యక్రమములో కోఆర్డినేటర్ యు నాగేశ్వరావు, ప్రాజెక్టు లీడ్స్ సాదిక్, జి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రజాపాలన కార్యక్రమం

నవతెలంగాణ-చేర్యాల



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం గ్యారంటీలకు సంబంధించి నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చేర్యాల మున్సిపల్ కమిషనర్ జి.రాజేంద్రకుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ చేర్యాల పట్టణంలోని 12 వార్డులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో నేటి నుంచి జనవరి 6 వరకు (డిసెంబర్ 31 జనవరి 1 మినహా) మిగతా రోజులలో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. వార్డులవారీగా 1వ వార్డు యుపిఎస్ కురుమవాడలో, 2వ వార్డు పెద్దమ్మ గడ్డ కమ్యూనిటీ భవనం, 3వ వార్డు కొత్తగా నిర్మించిన అంబేద్కర్ కమ్యూనిటీ భవనం, 4వ వార్డు రైతు వేదిక భవనం, 5వ వార్డు బీడీ కాలనీలోని కమ్యూనిటీ భవనం, 6వ వార్డు యుపిఎస్ బండపల్లి, 7వ వార్డు రజక కమ్యూనిటీ భవనం, 8వ వార్డు ప్రజెంటేషన్ హై స్కూల్, 9వ వార్డు పోచమ్మ దేవాలయం సమీపంలోని ముదిరాజ్ కమ్యూనిటీ భవనం, 10వ వార్డు మున్నూరు కాపు భవనం, 11వ వార్డు షాదీఖానా, 12వ వార్డు వైశ్య భవన్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

దేవులపల్లి రమేశ్‌కు తానా ప్రశంసలు

నవతెలంగాణ-నంగునూరు



సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన దేవులపల్లి రమేశ్‌ను తానా యాజమాన్యం ప్రశంసించింది. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో తెలుగు అతిథి ఉపాధ్యాయుడుగా (కవి, రచయిత) రమేశ్ విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 100 తెలుగు సంఘాల సమన్వయంతో చిగురుమళ్ళ శ్రీనివాస్, వందే విశ్వమాతరమ్ పేరుతో నిర్వహించింది. వంద దేశాలలో శాంతి సద్భావన యాత్రలో భాగంగా ఇటీవల 'అమ్మ, నాన్న, గురువు' శతక పద్యార్చన అనే అంశంపై అంతర్జాలంలో పాల్గొని సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమానికి వన్నెతెచ్చినందుకు అభినందనలు తెలుపుతూ తానా సంఘం అంతర్జాతీయ స్థాయిలో అంతర్జాలం ద్వారా పంపిన ప్రశంసా పత్రాన్ని కవి దేవులపల్లి రమేశ్ అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తానా యాజమాన్యం తనను గుర్తించి అభినందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, కవులు, పలువురు రమేష్ ను అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం జేపీ తండా గ్రామం పిట్టల గుడిసెలు కాలనీకి చెందిన పిట్టల యాదయ్య (56) అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబ పరిస్థితి గురించి సర్పంచ్ భిక్షపతి నాయక్ ఫోన్ ద్వారా మాజీమంత్రి హరీష్‌రావుకు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి రూ.ఐదు వేల అర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భిక్షపతి నాయక్, ఉపసర్పంచ్ ఆంజనేయులు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, విద్యార్థి యూత్ నాయకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని

నవతెలంగాణ-జగదేవపూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగ చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, తిగుల్ సర్పంచ్ కప్పార భానుప్రకష్ రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని కాంగ్రెస్ తోనే అన్నివర్గాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

ప్రజాపాలనలో కుటుంబాలన్నీ దరఖాస్తు చేసుకోవాలి

- ప్రజాపాలన సన్నాహక సమావేశంలో ఎంపీడీఓ రాము సూచన



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాల కోసం ధ్రువపత్రాలు లేకున్నా ఆధార్ కార్డ్ నంబర్‌తో ప్రజలందరూ దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ దమ్మని రాము సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజా ప్రతినిధులు,ఆయా శాఖ అధికారులతో ఎంపీడీఓ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు.కుటుంబంలోని మహిళా అభ్యర్థులే యజమానులుగా దరఖాస్తులు పూరించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను అమలు చేయడమే ధ్యేయంగా అధికారులు నిబద్ధతతో పని చేయాలని విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. ప్రజాపాలన సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండలంలోని ప్రజాప్రతినిధులు సహకరించాలని తెలిపారు. ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు అయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీల వద్ద దరఖాస్తులు స్వీకరించబడుతాయని జనవరి 6 తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబడమని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజాపాలన కార్యక్రమం సజావుగా సాగేల పోలీసులు భాగస్వాములవుతారని ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ నరేందర్‌రెడ్డి సూచించారు. ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, సర్పంచ్ ద్యావనపల్లి మంజుల, ఎంపీటీసీలు గుభిరే శారద, మహేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్యామ్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల సందేహాలు

బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగిస్తున్నారని పలు సందర్భాల్లో ప్రజా ప్రతినిధులు వెల్లడించిన సందర్భాలు ఉన్నాయి. బీఆర్ఎస్ పరిపాలనలో భాగస్వాములైన ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన సన్నాహక సమావేశంలో ప్రజాపాలన దరఖాస్తులో పూరించే వివరాలపై పలు సందేహాలను లేవనెత్తి ఎంపీడీఓ వద్ద నివృత్తి చేసుకోవడం ఆశ్చర్యం.

నేటి నుంచి గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-నంగునూరు



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన, ఆరు గ్యారంటీల అమలు కోసం నేటి నుంచి జనవరి 6 వరకు సంబంధిత అర్హుల నుండి దరఖాస్తుల స్వీకరణను విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి, నంగునూరు మండల స్పెషల్ ఆఫీసర్ కె.రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన ప్రజాపాలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వేణు గోపాల్, తహశీల్దార్ అనిల్ కుమార్, జడ్పీటీసీ తడిసిన ఉమా, రాజగోపాల్ పేట ఎస్సై మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు సమావేశానికి హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహి ంచడానికి అధికారులు, ప్రజాప్రతి నిధులు సిద్ధంగా ఉండాలని కోరారు. మండల, గ్రామ స్థాయిలలో ప్రత్యేక అధికారుల బృందాలను నియ మించామని మహాలక్ష్మి , గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాలు (ఆరు గ్యారెంటీ)ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో నిర్ణయించిన తేదీల్లో ఉదయం 8 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి 6 గంటల వరకు, రెండు ధపాలుగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వారికి కావలసిన కుర్చీలు, టెంట్లు, త్రాగు నీరు, మహిళల, పురుషులకు వేరువేరుగా క్యూలైన్లల్లు తదితర సౌకర్యాలు కల్పించా మన్నారు.ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు ఒకరోజు ముందు ప్రతి గ్రామాలలో దండోరా (టామ్ టామ్) వేయించా లన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు ముందు ప్రభుత్వ సందేశం వినిపించి కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. కార్యక్రమాలు నిర్వహించ బోయే తేదీలు సమయాలను ముంద స్తుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. దరఖాస్తు పత్రాలను ముందుగానే ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలి

- జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలలో జరిగే ప్రజా పాలన గ్రామసభల నిర్వహణలో దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చూసుకోవాలని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి సూచించారు. మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం అధ్యక్షతన ప్రజాపాలనపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాలవారీగా అధికారులు రెండు షిఫ్ట్‌లలో గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి దరఖాసుదారుడికి ఐదు నుంచి పది నిమిషాల సమయం కేటాయించాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగుల పాత్ర చాలా కీలకమైందన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. దరఖాస్తుదారునికి రూపాయి ఖర్చు లేకుండా చూడాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాసుదారుని వివరాలు కంప్యూటర్లో నమోదు చేయాలన్నారు. దరఖాసుదారునికి రసీదును వెంటనే అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏ డి ఏ రాధిక, తహసిల్దార్ లు అనంతరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ,అధికారులు,సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు

నేడే జిల్లాస్థాయి నెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-గజ్వేల్



మెదక్ ఉమ్మడి జిల్లా జూనియర్ నెట్ బాల్ జట్టు ఎంపిక నేడు గురువారం గజ్వేల్‌లోని గర్ల్స్ హబ్‌లో ఉదయం 9.30 గంటలకు జరుగుతుంది. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డ్ తీసుకోని రావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా నెట్ బాల్ కార్యదర్శి రంజిత్ కుమార్, గౌడ్ అధ్యక్షులు కే పి డానియల్ ఉపాధ్యక్షురాలు విజయ రేఖ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30,31, జనవరి 1 న నల్గొండలోని నాగార్జున నగర్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు నెంబర్ 9704611361 సంప్రదించగలరు అని తెలిపారు.

గర్భకోశ వ్యాధుల నివారణ కోసం రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

నవతెలంగాణ-తొగుట



గర్భకోశ వ్యాధుల నివారణ కోసం రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశు వైద్య అధికారి డాక్టర్ నిహారిక సూచించారు. బుధవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పశు గాణాభివృద్ధి ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఉచిత పశువైద్య శిభిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భకోశ వ్యాధుల నివారణ గురించి ఎప్పటి కప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గోపాలమిత్రుల సేవలతో పాటు ఉచిత పశువైద్య శిభిరాలను రైతులు సద్వినియో గం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వే జర్ భాస్కర్, వాజిద్, మహేందర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమం

























నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమంలో పట్టణంలోని అర్హులైన వారందరికీ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రజల విజ్ఞప్తులను స్వీకరించేందుకు పట్టణంలోని ప్రతి వార్డులో కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రజా పాలన యొక్క దరఖాస్తు ఫారములు కౌంటర్ వద్ద ఉదయం ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు మరియు మధ్యాహ్నము రెండు గంటల నుండి 6 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని తెలియజేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలవకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీమతి ఐలేని అనిత గారు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవ తెలంగాణ-కొండపాక

ప్రభుత్వం చేపట్టిన ఆరుగ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ ప్రజాపాలనపై అందరు సమన్వయంతో పని చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. కొండపాక లో బుధవారం ప్రజాప్రతినిధులు అధికారులతో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఆరు రోజులపాటు ఆరు గ్యారెంటీ ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలన్నారు. అధికారులతో కూడిన రెండు టీములుగా ఉదయం మధ్యాహ్నం గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని కౌంటర్లలో ఇవ్వనివారు జనవరి 6 వరకు గ్రామపంచాయతీలలో సమర్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, కొండపాక, కుకునూరు పల్లి కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్లు అమీనా, నాగేందర్, తహసీల్దార్లు శ్రీనివాస్, మల్లికార్జున్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారిని ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సాయిబాబా కార్యక్రమం గురించి మాట్లాడిన అనంతరం జై కేసీఆర్ జై తెలంగాణ అనగానే కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. రెండు పార్టీల నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

నవతెలంగాణ-మర్కుక్

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పాండుగౌడ్ అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్కుక్ ప్రత్యేక ఆధికారి, అడిషనల్ డి ఆర్డీవో కౌసల్య దేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మండలంలో తహశీల్దారు చంద్రశేఖర్ రావు, ఎంపీడీవో ప్రవీణ్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. షెడ్యూల్ ఆధారంగా ఆయా బృందాలు గ్రామాల్లోకి వెళ్ళి ఈనెల 28నుండి జనవరి 6వ తేదీ వరకు ఆరు గ్యారంటీల లోని పథకాలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుంటారని చెప్పారు. గ్రామసభకు ముందు గ్రామంలో చాటింపు వేయాలన్నారు.ప్రజల సందేహాలను నివృత్తి చేసి దరఖాస్తులు తీసుకోవాలని చెప్పారు. గ్రామాలలోని ప్రజలు వలస వెళ్ళిన వారుంటే సమాచారం అందజేయలన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కృష్ణ యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మర్కుక్ సర్పంచ్ భాస్కర్,పాములపర్తి సర్పంచ్ తిర్మల్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహశీల్దార్ చంద్రశేఖర రావు, ఎస్ఐ శంకర్, వ్యవసాయాధికారి నాగేందర్ రెడ్డి,ఏఈఓలు అభిలాష్,సుదీర్,పాషా, ఎంపీవో రాజలింగం, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

నవతెలంగాణ-వర్గల్

గ్రామీణ ప్రాంత పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై ప్రసంగించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను పేదలకు చేర్చే బాధ్యతను మర్చిపోవద్దని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించనుండగా, ప్రతి దరఖాస్తుకు ఖచ్చితంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ జత పరచాలని చెప్పారు. ప్రతి గ్రామంలో 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేస్తామని, గరిష్టంగా 5 కౌంటర్లు ఉంటాయని అన్నారు. 6 గ్యారంటీ పథకాలతో పాటు ఇతర భూ సంబంధ సమస్యల కోసం ప్రత్యేక కౌంటర్ ఉంటదన్నారు. ఆయా గ్రామాలలో సమయం గడువు దాటినా వచ్చే నెల 6 వరకు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు ఇవ్వొచ్చని వివరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి బాలు యాదవ్ , ఎంపీపీ లతా రమేష్ గౌడ్, ఎంపీడీఓ స్వర్ణ కుమారి, తహసీల్దార్ హరి కిరణ్, సీఐ జానకిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్

ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఏ మల్లేశం అన్నారు. తెలంగాణ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ప్రజాపాలనపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలకు సంబంధించిన దరఖాసుల్తను స్వీకరించాలన్నారు. ప్రతి లబ్ధిదారు ఆధార్ నెంబర్‌ను దరఖాస్తులో రాసే విధంగా చూడాలన్నారు. మండల అభివృద్ధి అధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తు చేసుకున్న వాటిని ఆన్లైన్లో పొందపచ్చడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులేని లబ్ధిదారుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు వైస్ ఎంపీపీ అల్లిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలను స్వయంగా ప్రజలకు అందించాలని ప్రశ్నించగా దానికి ఎంపీడీవో రాజేష్ కుమార్ స్పందిస్తూ రేపటినుండి జరిగే ప్రక్రియ కేవలం ప్రజలు ఇచ్చే దరఖాస్తులు మాత్రమే స్వీకరించడం జరుగుతుందని సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్ కుమార్, ఎంపీపీ గంగాధర్ సంధ్య జెడ్పిటిసి రణం జ్యోతి , జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రహిముద్దీన్, పిఏసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు హైమద్, వైస్ ఎంపీపీ అల్లి శేఖర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చైతన్యకుమార్ రెడ్డి, మండల విద్యాధికారి నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ గణేష్, ఎంపీపీ సాయిలు సూచించారు. అభయహస్తం గ్యారంటీల దరఖాస్తు స్వీకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతి నిధులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సాయిలు మాట్లాడుతూ, ప్రగతి పతం, సకల జనహితం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలనలో అధికారులు నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈనెల 28వ తేదీ నుండి జనవరి 6వ తేదీ వరకు జరిగే దరఖాస్తుల స్వీకరణలో అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆరు గ్యారంటీల అమలుకు ప్రజా పాలన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ను గ్రామాల్లో ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు అధికారులు ఆదేశించారు. కౌంటర్ల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, తహసిల్దార్, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని గురువారం నుండి వచ్చేనెల జనవరి ఆరవ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో తమ దరఖాస్తులను అధికారులు తీసుకుంటారని మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం అన్ని సంక్షేమ పథకాలకు ఫార్ములా ఏర్పాటు చేశారని, వాటి ప్రకారమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులలో ఈ కార్యక్రమాన్ని జనవరి 6 వరకు నిర్వహిస్తామని తెలిపారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అధ్యక్షత వహించారని ఆయన తెలిపారు. మున్సిపల్ 20 వార్డుల కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంపై అధికారులు ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని డిఆర్డిఓ జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాంధారి లతానరేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 100 ఇండ్లకు ఒక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,ఎంపీటీసీ సూతరి లలిత రమేష్, సర్పంచ్ పాగాల కొండల్ రెడ్డి, పిఏసీ ఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

గురువారం నుండి జనవరి 6 వరకు ప్రజా పాలన సభలు సమావేశాలు నిర్వహిస్తామని ఎంపీడీవో మచ్చేందర్ తెలిపారు. బుధవారం గజ్వేల్ మండలంలోని గ్రామ పంచాయతీల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం కోమడిబండ, మక్తమాసం పల్లి, బంగ్లా వెంకటాపూర్, రంగంపేట గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న గిరిపల్లి జాలిగామా, బయ్యారం, ధర్మరెడ్డిపల్లి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని చెప్పారు. 30వ తేదీన కొడకండ్ల రిమ్మను కూడా అక్కరం, దాతర్ పల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అని చెప్పారు. జనవరి రెండున శ్రీగిరిపల్లి, బురుగుపల్లి, దాచారం, అనంతరావుపల్లి లో కార్యక్రమం నిర్వహిస్తున్న ఆయన తెలిపారు. జనవరి మూడవ తేదీ సింగాటం, పిడిచాడు, రాగట్లపల్లి, బెజగామా, నాలుగవ తేదీన అంచిపూర్, కొల్లూరు దిలాల్పూర్, షేర్ పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు అని చెప్పారు. ఈనెల 5వ తేదీన ఆరెపల్లి, ఏటిగడ్డ కృష్ణాపూర్, వేముల గట్టు,, ఆరవ తేదీ లక్ష్మాపూర్, పల్లెపాడు, సింగారం, ఎర్రవల్లి తదితర గ్రామాల్లో నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కృష్ణా గౌడ్, తాసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -సిద్ధిపేటరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు దరఖాస్తులు అందించనున్న క్రమంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహణ సదస్సు నిర్వహించారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసి లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చిన్నకోడూరు

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు అందించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సిద్దిపేట ఆర్డీఓ రమేష్ ఆదేశించారు. ఈ నెల 28 నుండి జనవరి 6వరకు ప్రతి రోజూ 4 గ్రామాల్లో కార్యక్రమం ఉన్నప్పటికీ ప్రతిరోజూ వచ్చిన దరఖాస్తులు తీసుకోవాలని, ఒక కుటుంబం నుండి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించాలని అన్నారు. దరఖాస్తు దారులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఇతర సమస్యలు పై దరఖాస్తు వచ్చిన ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేసి తీసుకోవాలని అన్నారు. ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజాప్రతి నిధులు, అధికారులు ప్రజల కోసమే పని చేయాలని చిన్నకోడూరు ఎంపిపి కూర మాణిక్యరెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. దరఖాస్తులలో తప్పులు లేకుండా నింపేందుకు సహాయకులను నియమించాలని సూచించారు. పెన్షన్ దారులు ఏరకమైన పెన్షన్ వస్తుందో తెలుపుతూ టిక్ చేసి వివరాలు తెలపాలని సూచించారు.

నవతెలంగాణ-రాయపోల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో మున్నయ్య అన్నారు. ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం రాయపోల్ మండల కేంద్రం రైతు వేదికలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రజా పాలనపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బాబు నాయక్, జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, తహసిల్దార్ దివ్య, ఎస్సై రఘుపతి, వైద్యాధికారి మహారాజ్, ఏపీఎం దుర్గాప్రసాద్, ఎంపిఓ లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ జాతీయ పోటీలకు మర్పడగ విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ కొండపాక

కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాల విద్యార్థి రాజేష్ బేస్ బాల్ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైరయ్య తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు మహబూబాబాద్ తొర్రూర్‌లో జరిగాయి. ఇందులో మర్పడగ విద్యార్థి అండర్ 14 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోజరగనున్నాయి. స్థాయికి ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించారు. జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు తోట సతీష్, ఉపాధ్యాయ బృందం గీత, పద్మ, మమత, ఉమాదేవి ,రంగారావు, అంజయ్య, కల్లపల్లి శీను, రాజేందర్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలకు ఒకే దరఖాస్తు

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



ఆరు గ్యారంటీ పథకాలకు ఒకే దరఖాస్తు అందజేయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విడుదల చేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన లోగోను విడుదల చేశారని చెప్పారు.. నిస్సహాయులకు సాయం అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం వద్దకు ప్రజలను రప్పించడం కాదని, ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకు వెళ్తున్నామన్నారు. గురువారం నుండి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు తూప్రాన్, సిద్దిపేట, చేర్యాల, హుస్నాబాద్ నుంచి గ్రామ, వార్డు సభలు ఉంటాయన్నారు. ఈ సభల ద్వారా ఆరు గ్యారెంటీల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీలను అర్హులైన వారికి ఇస్తామన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. ఒకవేళ దరఖాస్తులో ఏదైనా సమస్య ఉంటే దరఖాస్తుదారుకు చెబుతామన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-మర్కుక్

మండల స్పోర్ట్స్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం ఉదయం శివారు వెంకటాపూర్, చేబర్తి గ్రామాల జట్లు తలబడగా శివారు వెంకటాపూర్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో పాములపర్తి బీ టీం, ఇప్పల గూడెం తలబడగా పాములపర్తి బి జట్టు విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో వరదరాజపూర్, పాములపర్తి ఏ తలబడగా పాములపర్తి విజయం సాధించింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల కో ఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెరా నరేష్ హాజరై విజయం సాధించిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్ధరాజ్ పూర్ మాజీ సంఖ్య సర్పంచ్ లక్కాకుల నరేష్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు కృష్ణ, క్రీడాకారులు, తదితరులున్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-దౌల్తాబాద్

కాంగ్రెస్ పార్టీ నూట ముప్పై ఎనిమిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల అమలు కోసం నేటి నుండి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి కాంగ్రెస్ 6 గ్యారంటీల కోసం దరఖాస్తులు స్వీకరించనుందని, ఈ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలన్నారు.

ఆపద్బాంధవుడు పొన్నమన్న

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట నుంచి హుస్నాబాద్ వెళ్లే ప్రధాన ం ఎ ా దా రి ె ఖ వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతిన్నది. ఈ రోడ్డు మరమ్మతుల విషయమై గతంలో ఎన్నిసార్లు అప్పటి నాయకులు అధికారులకు చెప్పిన పట్టించుకున్న దాఖలాలు లేవని అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి అన్నారు. దీంతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విషయం చెప్పడంతోనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను క్లియర్ చేశారని తెలియజేశారు. ఆపద్బాంధవుడులా ఆదుకున్న పొన్నం ప్రభాకర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జర్నలిస్టు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మిరుదొడ్డి

జర్నలిస్టు రాజు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మిరుదొడ్డిలో నిర్వహించిన రాజు జన్మదిన వేడుకల సందర్భంగా జర్నలిస్టు మహేష్ మాట్లాడుతూ రాజు మిరుదొడ్డి మండలంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పేదలకు సేవలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు భూపతి గౌడ్ బాపురెడ్డి, భాగులు, చంద్రమౌళి, రాజు జర్నలిస్టులు రామచంద్రం, కరుణాకర్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గౌరవెల్లి, బొడిగ పల్లి గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రోగ్రామ్‌ను డాక్టర్ వినోద్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం గురించి బిగ్ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బీపీ, షుగర్, రక్త మూత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అక్కన్నపేట మండల అధ్యక్షుడు వీరాచారి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, హెచ్ఈఓ నారాయణదాసు, హెచ్ ఈ వెంకటలక్ష్మి, ఎంఎల్ హెచ్ పి విజయ, ఏఎన్ఎం సారమ్మ, బిబిఎం స్రవంతి, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రామకోటి రామరాజు సేవలు అభినందనీయం

నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ గజ్వేల్‌వారి నిర్వహణలో బుధవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో వివిధ ధార్మిక సేవా సంస్థలు పాల్గొన్నాయి. వారి సేవలు అందించారు. ఇందులో శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ కూడా పాల్గొంది. ఆ సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు గారిని ఎమ్మెల్సీ వంటేరు



యాదవరెడ్డి గారు శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు.

గ్రంథాలయంలో సమస్యలు లేకుండా చూడాలి

- బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



గ్రంథాలయంలో సమస్యలు లేకుండా పరిష్కరించాలని బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ గ్రంథాలయాన్ని సందర్శించిన రవీందర్‌గౌడ్ మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణం, మండలానికి సంబంధించి వివిధ గ్రామాలకు చెందిన నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటారన్నారు. గ్రంథాలయంలో వివిధ దినపత్రికలు మరియు విజ్ఞానానికి సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉండటం వల్ల ఆర్థికంగా లేని నిరుద్యోగులకు బాసటగా గ్రంథాలయం ఉంటుందన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని విశ్రాంత ఉద్యోగ భవనంలోకి మార్చారు. రెండు సంవత్సరాలు గడుస్తున్న గ్రంథాలయం విషయంలో ఎటువంటి నిర్మాణం లేకపోవడం వల్ల యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రవాణా, బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాశ్వత భవనం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినయ్, చంద్రశేఖర్, జ్యోతి నిరుద్యోగులు పాల్గొన్నారు